
# 'అరుణ' పుట్టిన రోజు



ఆరోజు తన పుట్టిన రోజు. ఎంతో వుల్లాసంగా లేచి తలంటిసీళ్ళు పోసుకుని కొత్తబట్ట లేసుకొన్నది శాంతి. భర్తతో కాసేపు సరదాగా వుండాలని తొందర తొందరగా తన రూముకేసి వెళ్ళింది. అప్పుడే అద్దంముందు నిలబడి తలదువ్వుకొంటూ ఎక్కడికో హడావిడిగా బయలుదేరుతున్నాడు శేఖర్.

శాంతిరాక గమనించి "నిన్నయిచ్చిన డబ్బుల్లో వేయిరూపాయలు ఇవ్వుశాంతి!

లారీకి టైర్లు కొని వెయ్యాలి." అని అన్నాడు శేఖర్!

ఆమెవైపు తిరిగేసరికి శేఖర్ కళ్ళు ఒక్కనిమిషం జిగేల్ మనిపించాయి. ఎఱ్ఱటి వెంకటగిరిచీర, దానిమీద తెల్లటి బ్లౌజు, చెవులకు రవ్వలదిద్దులు, మెడలో సన్నటి ముత్యాలవరుసల నక్లెసు, అప్పుడే తలంటిస్నానం చేయుటంవలన జడ వదులు, వదులుగా అల్లుకొన్నది. ఈ ముస్తాబుతో ఆమె పచ్చటి శరీరచ్ఛాయ మెరిసిపోతున్నది. కంటికొసలలో తీర్చిన కాటుకరేఖలు ఆమె గుండ్రటి పెద్ద కళ్ళను ఎంతో నిండుదనాన్నిస్తున్నది. ఒకంతసేపు చూపులు తిప్పుకోలేక పోయాడు శేఖర్.

"ఏమిటీరోజు దేవిగారి ముస్తాబులో క్రొత్తదనం కనిపిస్తున్నది." అన్నాడు చిలిపిగా. భర్త మాటలకు శాంతి ఒళ్ళు పులకించి ఆమెచెక్కిళ్ళు గులాబీలుపూసి ఎఱ్ఱటి ఆమె పెదవుల్లోని విరిసీ విరియని చిరునవ్వు ఒక్కసారి ముత్యాల పలు వరుసను తళుక్కు మనిపించింది.

"ఏమిటీరోజు రాణిగారు ఏవో క్రొత్త లోకాలలో వున్నట్లున్నది." అన్నాడు శేఖర్ దగ్గరకొచ్చి ఆమె గడ్డాన్ని పుణికి పైకెత్తి కళ్ళలోకి చూస్తూ. ఆ స్పర్శతో ఆమె మరింత సిగ్గుతో ముడుచుకపోయి అతని ఎదమీద తలవాల్చి "ఈరోజు నా పుట్టినరోజు" అన్నది.

"ఓహో అదా సంగతి. నాకు తెలియనే తెలియదే" అని ఆమెను పొదవిపట్టుకొని బుగ్గమీద గట్టిగా ఒక ముద్దుపెట్టుకొని "అయితే నీకు ఏమి బహుమతి కావాలో అడుగు శాంతీ" అన్నాడు ఎంతో లాలనగా.

"అడిగింది తప్పక యిస్తారా?" అన్నది అతని కళ్ళలోకి గుచ్చిచూస్తూ.

"రాణీగారు అడగడము, యీ సేవకుడు ఇవ్వకపోవడమూనా! అడుగుశాంతీ నీ కేంకావాలో" అన్నాడు శేఖర్.

"దేవుని దయవలన నాకు అన్నీ వున్నాయి. ఏకొరతా లేదు. నాకు కావలసింది యీ ఒక్కరోజు మీరు నాతో ఆనందంగా గడపాలని, ఏవయినా పనులుంటే యీరోజు నాకోసం మాను కోమని చెబుతున్నాను." అన్నది ఎంతో ఆశగా.

"సారీ! శాంతీ! ఈరోజు సోమవారం. లారీలను లోడ్లకు పంపించాలి. రహస్నాలకు పోయే లారీకి టైర్లు పోయినవి. టైర్లువేసి మధ్యాహ్నానికయినా దాన్ని లోడ్‌కు పంపించాలి. ఈరోజు పూర్తిగా నీతో వుంటే ఎంతడబ్బు నష్టమవుతుందో ఆలోచించావా?"

శేఖర్ మాటలకు శాంతి హృదయం బాధగా మూలిగింది. దెబ్బతిన్న లేడిలాగ ఆమెమొహం పాలిపోయింది. పేలవంగా నవ్వి "డబ్బు! డబ్బు! మనిషికి సుఖంలేని డబ్బు ఎందుకండీ! ఇప్పుడు వున్నదంతా కూర్చొని తిన్నా పది తరాల

కయినా మిగుల్తుంది. అలాగని మిమ్మల్ని ఎప్పుడూ నాదగ్గరే చేతులు ముడుచుకొని కూర్చోమనలేదు. ఏవయినా సరదాలు మనము అనుకొన్నపుడు రావు. ప్లీజ్! నాకోసం యీ ఒక్కరోజు వుండిపోండి!" అన్నది శాంతి.

శాంతి మాటలకు ఆమెతల నిమురుతూ "పిచ్చిశాంతీ! నీకింకా లోకానుభవం తెలియదు. డబ్బువిలువ అంతకన్నా తెలియదు." అని శేఖర్ యింకా ఏమో చెప్పబోయేంతలో "శేఖరా! ఏం చేస్తున్నావురా యింకా? ఈ యింటిలో ఒక్కరూ నేను చెప్పినమాట వినరు. గూటి పందులులాగ ఎంతసేపు ఇళ్ళల్లో దూరుకుంటే బయటే రారుకదరా. ఎలా మీరు బతుకుతారో! ఏమో! ఒక్కడికీ బాధ్యతే తెలియదు. అరచి అరచి నానోరు పడిపోవలసిందే. ఇంకయినా తెమిలి రండిరా." అన్న రాధాబాయమ్మ కేకలు ఆబిల్డింగు ప్రతిధ్వనించి ఇద్దరి చెవుల్లోనూ పడ్డాయి

శేఖర్ "వస్తున్నానమ్మా!" అని చెప్పి "శాంతీ! చూశావా అమ్మ కోప్పడుతున్నది. ఈరోజు తొందరగా వచ్చేస్తాను. ఏమనుకోకు." అని షర్టు గుండీలు సరిచేసుకొంటూ తొందర తొందరగా వెళ్ళిపోయాడు.

భర్తతో సరదాగా కాలక్షేపం చేయాలనుకొన్న శాంతికి ఎంతో ఆశాభంగమయి బాధపడిపోయింది ఏమీ తోచక అచేతనంగా కొంతసేపు నిలబడిపోయిన శాంతికి దుఃఖము ముంచుకురాగా అక్కడే వున్న కుషన్ మంచముమీద కప్పగాపడి దిండులో తలదాచుకుంది. పదినెలల పాప ప్రాకుతూవచ్చి కొంగుపట్టి లాగింది 'అమ్మా' అంటూ. శాంతి తొందరగాలేచి కళ్ళుతుడుచుకొని పాపను ఎత్తుకొని హృదయానికి హత్తుకొన్నది.

ఇంతలో తోడికోడలు సుశీలవచ్చి "శాంతీ పెన్నువుంటే యిస్తావూ వుత్తరం వ్రాయాలి." అన్నమాటలకు యీలోకం లోకొచ్చి గబ గబ లేచి మొహంలో లేని చిరునవ్వు తెచ్చుకొని పెన్నుతెచ్చి సుశీలకు యిచ్చింది. ఇంతలో రాధాబాయమ్మ "పాపా! యిలా రండి ఈ అనపకాయలు వలవాలి. ఇంతమంది ఆడవాళ్ళు వున్నారుగానీ ఒక్కరూ వంటింటి గడపకేరారు. ఎన్నిరోజులు జరగాలమ్మా యీ భోగాలూ!" అన్న అత్తగారి కేకలకు శాంతి వస్తున్నానత్తయ్యా! అంటూ గదితలుపులు దగ్గరగా చేరవేసి వంటింటివైపు నడిచింది సుశీలమాత్రం పెన్ను తీసుకొని ఏమీ పట్టనట్టు తన గదికేసి వెళ్ళిపోయింది.

పాపను అత్తదగ్గర కూర్చోబెట్టి అనపకాయ వలవడానికి వుపక్రమించింది శాంతి. పాప అటూయిటూ ప్రాకుతూ చెంబులు, గిన్నెలు సర్దడం ప్రారంభించింది. రాధాబాయమ్మ స్థూలకాయురాలు! ఆమె కూర్చొంటే మళ్ళీ లేవలేదు. ఆ



పాపను పట్టలేక "లెయ్యమ్మా! లేచి కూతుర్ని ఎత్తుకో. మీరు పనులుచేసి సంసారాలు నిలబెట్టింది చాలు. నీ కూతుర్ని తీసుకపోయి కూర్చోతల్లీ." అని సణగటం ప్రారంభించేసరికి శాంతి కిక్కురు మనకుండా కూతుర్ని తీసుకొని యీవలకొచ్చేసింది. ఇంతలో సుశీల వచ్చి "శాంతీ ఈ పెన్నుతీసుకో. అయిపోయిందా పని? ఇంతమంది పనివాళ్లు వుండగా ఈమె కెందుకింత రంధి?" అనేసి వెళ్ళిపోయింది.

శాంతి పాపను నిద్రపుచ్చి పాప ప్రక్కనే పడుకొన్నది. ఆమె మనసు యివ్వాళ చాలా చికాకుగా వున్నది. ఏమి టేమిటో ఆలోచనలు. మరెంతో విచారము. ఒక్కక్షణం ఎందు కీజీవితం అనిపించింది ఆమెకు. తను పుట్టిందగ్గరనుండి ఏ సుఖానికీ నోచుకోలేదు. తిండికి బట్టకు ఏ లోటూ వుండేదికాదు. మానసికంగా పసివయస్సునుండి ఒక్క రోజు ఆనందంగా వుండలేదు.

అత్త రాధాబాయమ్మ కాస్తగయ్యాళి.

పెళ్ళయాక మదరాసు వచ్చిన వారం పదిరోజులకి అత్తింటి పరిస్థితులు పూర్తిగా అవగాహన మయిపోయినయ్."

అత్తగారింటిలో తనకు, తన భర్తకు ప్రత్యేకించి ఒకగది యిచ్చారు. తన వస్తువులన్నీ అందులోనే వుంచుకొన్నది.

అత్తగారి ఆజ్ఞలేనిదే ఎవరూ ఏపని చేయడానికి వీలులేదు. తనకు ఇద్దరు తోడికోడళ్ళు. ఆ యింటిలో నౌకర్లకుండే విలువగూడ ఆ యింటిలో కోడళ్ళకులేదు. పనివాళ్ళు పెట్టిన అన్నం తినాలి. ఎవరి గదుల్లోకి వాళ్ళు వచ్చేయాలి. భర్తలకుగూడ పనివారే వడ్డిస్తారు. భార్యలు వడ్డించడానికి వీలులేదు. ఆడవారు ఎవరికంటా పడకూడదు. ఎవరయినా కొత్తవారొస్తే వెంటనే లోపలి కెళ్ళిపోవాలి. తనతలిదండ్రులొచ్చినాసరే తను స్వంతంగా ఏమిచేయడానికి వీలులేదు...

... ఇక భర్తగారు సరేసరి. ఒక క్షణం యింటిపట్టున వుండడానికి వీలులేదు. ఎప్పుడూ వ్యాపారాలు, లారీలు, లోడ్‌లు బుక్ చెయ్యడం, డబ్బులు వసూలు చేసుకోవడం సరిపోతుంది. ఒక పదినిమషాలు ఇంటిదగ్గరవున్నా అత్తగారు గట్టిగా కేకలుపెట్టి పంపేస్తారు.

తన ఆశలన్నీ కూలిపోగా ఒకవిధమయిన నిర్లిప్తత అవహించి శూన్యంగా జీవించసాగింది. "పాపకు జ్వరం డాక్టరుకు చూపించాలండీ!" అంటే "ఈరోజే ఎక్కువలోడ్లు వస్తున్నాయి శాంతీ! రేపు తీసుకెళతా!" అని సమాధానం వచ్చేది.

"ఈరోజు చికాగ్గా వున్నదండీ ఏదయినా సినిమాకు తీసుకెళ్ళరూ?" అంటే లారీలు పదిగంటలకుగానీరావు శాంతీ ఈరోజు. రేపువెళ్ళదాం." ఇలాంటి సమాధానాలు రావడంతో భర్తను యింకేమీ అడగటానికి ఆమె ఎప్పుడూ సాహసించలేదు.

ఇంతలో పాపలేచి ఏడ్వటం మొదలు పెట్టేసరికి వుల్క్కిపడి ఈ లోకంలో కొచ్చిపాపకు పాలుపట్టి ఆడుకోనిచ్చింది.

కనీసం రాత్రి ఏడుగంటలకయినా యింటికివస్తారని ఎంతో ఆశగా ఎదురు చూచింది. ఏడయింది. ఎనిమిదయింది. పది, పదకొండుగూడ దాటింది ముల్లు. ఎంతో దుఃఖంవచ్చింది. వెంకటేశ్వర పటంముందువెళ్ళి తనివిదీర ఏడ్చి ఇకనా జీవితమింతే భగవాన్ నాకెందుకు యీ బంగారుపంజరం? ఎందుకు అన్యాయం చేశావని ఏడ్చి మనసును తేలికపరచుకొని నాగతి యింతే. నీవుమాత్రం ఏంచేయగలవు? అని మనసు దిటవుపరచుకొని వెళ్ళి పడుకుంది.

గట్టి మనసు చేసుకొని నిదురపోయింది. భర్తవచ్చాడు. ప్రక్కనపడుకున్నాడు. లేపాడు. తనకు మెలకువవచ్చింది.

"కోపమొచ్చిందా?" అడిగాడు.

ఆమె ఆనందానికి మేరలేకపోయింది. సాయంత్రంనుంచి ఆమె మనస్సులో మెదిలిన ఆలోచనలన్నీ ఒక్కసారిగా అదృశ్యమై పోయ్యాయి.

ఆరోజు ఆమె పుట్టినరోజు అందుకని అన్నీ మరచిపోయి ఒక్కసారిగా అతన్ని కౌగలించుకుంది.

——